# జోక్ సిక్సర్

వాణిశ్రీ




"నీకీసారి జాబ్ రావడం ఖాయంరా." అన్నాడు చంద్రయ్య వస్తూనే. పడకుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్న శేఖర్ లేచి నిలబడి ఏమిటి విశేషం అన్నట్లు తండ్రిముఖంలోకి చూశాడు.

చంద్రయ్య చాలా ఆనందంగా వున్నాడు. అప్పుడే కొడుక్కి ఉద్యోగం వచ్చినంత సంబరపడిపోతున్నాడు.

"నీకు ఇంటర్వ్యూ వచ్చిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టరూనూ, మనవెంకయ్యనాయుడూ క్లాస్‌మేట్లట. 'నేను రేపు ఎటూ హైదరాబాద్ వెళ్తున్నా. మీ కుర్రాడ్ని నాతో పంపించు' అన్నారు నాయుడుగారు."

శేఖర్ చాలా సంతోషించాడు. వెంకయ్యనాయుడుగారు ధనవంతుడు. మంచి పలుకుబడి గలవాడూనూ. ఆయన తల్చుకోవాలేగాని తనకి జాబ్ రావటం ఎంతసేపు అనుకున్నాడు

"నాయుడుగారు సామాన్యంగా ఎవరికీ మాట ఇవ్వడు ఇచ్చాడో ఇక ధోకా లేదు."

"నిజమే!" అన్నాడు శేఖర్. అతనికి వెంకయ్యనాయుడుగారి రికమండేషన్ దొరకడం ఏదో పెన్నిధి లభించినట్లుంది.

"అన్నట్లు నీ ఇంటర్వ్యూ ఎల్లుండి ఉదయం పదింటికి కదూ!"

"అవును"

"నాయుడుగారు రేపు సాయంత్రం కార్లో వెళ్తారు ఆయనతోపాటు వెళ్ళు ఛార్జీలు కూడా కలిసివస్తున్నాయి, శుభ సూచకం. అని తృప్తిగా నవ్వాడు చంద్రయ్య.

మర్నాడు శేఖర్ వెంకయ్యనాయుడు గారి వెంట బయల్దేరాడు.

"నువ్వు చంద్రయ్య కొడుకువా?" అని మాత్రం అన్నారు నాయుడుగారు

అవునన్నట్లు తలవూపాడు శేఖర్.

తర్వాత ఇంకేమీ మాట్లాడలేదు. ఆయన వెనకసీట్లో కూర్చుని ఏదో ఆలోచనలో పడ్డారు. శేఖర్ ముందు కూర్చున్నాడు,

బెజవాడ వెళ్ళేసరికి చీకటిపడింది.

"మీటింగ్ అయ్యాక బయల్దేరుదాం." అని ఆయన మీటింగ్ హాల్లోకి వెళ్ళారు.

గంటయింది రెండు గంటలయింది. శేఖర్ నడుం నెప్పిపుట్టి కారు దిగి అటూ ఇటూ పచార్లు చేశాడు. వాచీ చూసుకున్నాడు. ఎనిమిది దాటింది.

ఆకలి మొదలయింది.

డ్రైవర్ హాల్లోకి వెళ్ళివచ్చి "భోజనం చేసి రమ్మన్నారండీ. ఎక్కండి" అన్నాడు స్టీరింగ్ ముందు కూర్చుని. ఇద్దరూ హోటల్లో భోజనంచేసి వచ్చారు పది దాటింది.

నాయుడుగారి జాడలేదు.

మరో గంట దాటేసరికి శేఖర్ కి నిద్ర ముంచుకువచ్చింది. ఆవులించాడు.

"వెనక సీట్లో పడుకోండి బాబూ! ఆయ నవస్తే లేపుతాను." అన్నాడు డ్రైవర్ శేఖర్ అవస్థ గమనించి.

శేఖర్ నిద్రపోయాడు.

మెలుకువ వచ్చేసరికి తూర్పున తెల్లవారింది.

ఉలిక్కిపడి లేచాడు శేఖర్. ఇంటర్వ్యూ ఆ రోజే. ఇంకా బెజవాడ లోనే ఉన్నాడ. నాయుడుగారు ఇంకా రాలేదు ఎలా?" అనుకొని కంగారు పడ్డాడు.

దగ్గరలో ఉన్న చిన్న హోటల్లో ముఖం కడుక్కొని కాఫీ త్రాగాడు.

ఎనిమిదింటికి నాయుడుగారు వస్తూనే శేఖర్ ని చూసి భుజంతట్టి "అనుకోకుండా ఆలస్యం జరిగిపోయిందోయ్! మనం హైదరాబాద్ వెళ్లేసరికి భోజనంవేళ అవుతుందనుకుంటా. అన్నట్టు నీ క్వాలిఫికేషన్స్?" అన్నారు.

"బి కామ్. సార్," అన్నాడు శేఖర్ వినయంగా.

"ఉద్యోగంవస్తే ఆ కంపెనీలో జీతం ఎంత?"

"మూడు వందలు సార్."

"ముష్టి మూడొందలు అక్కడేం సరిపోతాయ్! బ్యాంకిలో అయితే ఆరు వందలు జీతం. ఈసారి ఖాళీలు వచ్చినప్పుడు ఇప్పిస్తా! సరేనా? ఇక నువ్వు బస్సెక్కి ఇంటికి వెళ్ళు. అప్పుడప్పుడూ కనిపిస్తూండేం. మర్చిపోకు." అంటూనే కార్లో ఎక్కి కూర్చుని డోర్ వేసుకున్నారు.

శేఖర్ నోరుతెరుచుకుని చూస్తూనే వున్నాడు. కారు లేపిన దుమ్ము అతని నోట్లో పడింది.